# కర్మణ్యేవాధికారస్తే

బషీర్ బాగ్ చౌరస్తా దగ్గిర కొచ్చేప్పటికి ఎర్రలైటు వెలిగింది.

విసుక్కుంటూ స్కూటర్ ఆపేశాను. పనికి మాలిన ట్రాఫిక్ రూల్సూ - వీళ్ళూ - ఛీ . . . . అసలే మా ఆఫీసరు ఛండాలపు వెధవ. . .ఇప్పటికే అరగంట ఆలస్యమై చచ్చింది.

"సార్. . . .." అసహనంగా కిందికి చూశాను. కాళ్ళ దగ్గిర వీడు - చక్రాల బల్ల మీద. . . . గత మూడేళ్ళ నించీ వీణ్ణి చూస్తూనే ఉన్నాను. చౌరస్తాలో ఉన్న గుడి దగ్గర గద్దలా ఎదురుచూస్తూ కూచుంటాడు. రెడ్‌లైట్‌కి ట్రాఫిక్ ఆగడం ఆలస్యం చక్రాల బల్లని చేతుల్తో నెట్టుకుంటూ వచ్చేస్తాడు "సార్" అనుకుంటో. మురికి వెధవ - ఆ చక్రాల శబ్దం ఒకటి - కర్ణకఠోరంగా.

"లేదు ఫో" అన్నాను ఎప్పటిలానే.

వాడు చిర్నవ్వు నవ్వి మరో స్కూటర్ దగ్గిర కెళ్ళిపోయి అడుక్కుంటున్నాడు.

వీడంటే అందుకే మరీ అసహ్యం. మూడేళ్ళ నించీ వీడికి నేను పైసా విదల్చలేదు. అయినా అడగటం మానడు. దానికి తోడు ఆ బోడి చిర్నవ్వొకటి. . నేను లొంగుతానను కుంటున్నాడేమో. . . అలా కరిగిపోయే రకం కాదని వీడికింకా తెల్సినట్టు లేదు.

గ్రీన్ లైట్ వెలిగింది. . . మరో అయిదు నిముషాల్లో ఆఫీస్‌లో ఉన్నాను.

సీట్‌లో కూచున్నానో లేదో ఆఫీసర్ నించి పిలుపు. . . .

"టీ తాగుతున్నానని చెప్పు ఫో. . . . మూడేళ్ళ నించీ ఇంక్రిమెంట్లు ఇవ్వడు గానీ పంక్చువాలిటీ, వర్క్ ఈజ్ వర్‌షిప్ లాంటి ఉపన్యాసాలిస్తాడు. వీడిచ్చే బోడి జీతానికి నేను చేస్తున్న పనే చాలా ఎక్కువ" ఫ్యూన్ మీద విసుక్కున్నాను.

పక్క సీట్లోని చలపతి పెద్దగా నవ్వాడు.

కొరకొర లాడ్తూ చూశానతనివైపు.

"నీవు సరిగ్గా పని చేస్తేనే కదా యింక్రిమెంట్లు ఇచ్చేది. వేళకు రావు. వచ్చినా కస్సుబుస్సు లాడుతూ ఉంటావు తప్ప శ్రద్ధగా పనిచేయవు" అన్నాడతను.

చలపతికి నా దగ్గిర చనువెక్కువ.

"మరేం చేయమంటావు. వీడిచ్చే చాలీ చాలని జీతంతో సంతోషంగా ఉండటం ఎలా సాధ్య పడ్తుందీ? ఆ శిక్ష చాలదన్నట్లు నామీద కక్షతో యింక్రిమెంట్లు కూడా ఆపేస్తే శ్రద్ధగా పనిచేయడానికి మనసెలా ఒప్పుతుందీ?" అన్నాను.

"నువు చెప్పింది కరెక్టే. కనీసం ఆఫీసర్‌తో అయినా సౌమ్యంగా మాట్లాడ వచ్చుగా".

నేను సమాధానం చెప్పలేదు. చెప్పినా వీళ్ళకు అర్థం కాదు. వేట కుక్కల్లా తరిమే అవసరాలూ, వాటిని తీర్చలేని నా అసమర్థతా - ఎక్కడ ఉన్నా - గుమికూడి - చుట్టుముట్టి వూపిరాడ నీయకుండా రక్తం పీల్చే ఆలోచనలు. ఇంకెక్కడి ప్రశాంతత? ఇంకెక్కడి సౌమ్యత?

ఎప్పటికి మల్లే ఆ రోజూ సరిగ్గా పని చేయలేదు. ఎప్పట్లానే ఆఫీసరుతో గొడవ కూడా పడ్డాను.

* * * * *

బషీర్‌బాగ్ చౌరస్తా దగ్గిరకు రాగానే రెడ్ లైట్ పడింది. ఈ చక్రాల బల్లమీద అడుక్కునేవాడికీ వీళ్ళకూ ఏమైనా బిజినెస్ ఒప్పందం ఉందేమో. . .

"సార్" కాళ్ళ దగ్గిర మరలా వాడు.

విపరీతమైన కోపం వచ్చింది నాకు.

వాడిలో అదే చిర్నవ్వు. . . .

వాడిని గుడి పక్కకు పిల్చుకెళ్ళాను.

"నీకేమైనా బుద్ధుందా? మూడేళ్ళ నుంచీ నేనెపుడైనా నీకు పైసా వేశానా? అయినా ఎందుకు అడగటం మాత్రం మానవు?" అన్నాను కోపంగా.

వాడు చాలా హాయిగా నవ్వాడు.

"సార్. అడుక్కోవటం నా వృత్తి. దీంట్లోకి దిగే ముందే ఇందులోని సాధకబాధకాలకు తలవొగ్గి దిగాను. మీరు వేసినా వేయకున్నా అడగటం నా వృత్తి ధర్మం. మీరు తిట్టినా చీదరించుకున్నా అది కూడా నా వృత్తిలో ఒక భాగమే. నా వృత్తిని నేను మనస్ఫూర్తిగా ఇష్టపడి చేస్తున్నాను. కాబట్టే మీలాంటివాళ్ళు ఎంత అసహ్యించుకున్నా నవ్వుతూ ఉండ గలుగుతున్నాను" అన్నాడు.

వాడు మాట్లాడింది నాలుగే వాక్యాలు. అందులో నాకిన్నాళ్ళూ అర్థం కాకుండా ఉండిపోయిన జీవిత సత్యాలు స్పష్టంగా అవగతం అవుతున్నట్లనిపించింది. వాడా క్షణం నాకు గీతోపదేశం చేస్తున్న కృష్ణ భగవానుడిలా కన్పించాడు.

నా జీతం పెరిగితే యింటిలోని ఆర్థిక సమస్యలు కొంతైనా సర్దుకుంటాయి. అపుడు నేను ప్రశాంతంగా పనిచేయగలను. నేను సవ్యంగా పని చేస్తేనే జీతం పెరుగుతుంది. ఈ వలయానికి యిన్నాళ్ళూ తుదీ మొదలు అర్థం కాలేదు. యిపుడు జ్ఞానోదయం అయిన అనుభూతి. . . .

ఈ రోజు చాలా శ్రద్ధగా పనిచేశాను. ఎప్పటికి మల్లే ఆఫీసర్ పిలిచి చివాట్లు వేశాడు. ఎప్పటిలా నేను ఎదురు తిరక్కపోయేటప్పటికి ఖంగుతిని ఉంటాడు.

క్రమంగా ఆఫీసర్ నించి చివాట్లు తగ్గి నాపనిని మెచ్చుకోవడం ప్రారంభమైంది.

మరో ఆర్నెల్లకు ఆపేసిన మూడు యింక్రిమెంట్లతో పాటు అదనంగా మరో యింక్రిమెంట్ శాంక్షన్ అయింది.

ఇపుడు ప్రతిరోజూ ఆ చౌరస్తా దగ్గిర స్కూటర్ ఆగగానే నా కళ్ళు అనాయాసంగా అతని కోసం వెతుకుతాయి - కృతజ్ఞతతో. . . .

*• మయూరి వీక్లీ, నవంబర్ 17, 1995 •*